నీటి కాలుష్యానికి పాల్పడితే కఠినచర్యలు

కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చేతి అద్దకం, యాంత్రిక అద్దకం పరిశ్రమలు నగరి చుట్టుపక్కల ప్రాంతాలలో నీటి కాలుష్యానికి పాల్పడితే కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నగరి, చుట్టుప్రక్కల ప్రాంతాలలో నడుస్తున్న అద్దకం పరిశ్రమల వలన దిగువ ప్రాంతాలైన నింద్ర, విజయపురం మండలాల్లో కలుగుతున్న నీటి కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, అద్దకం పరిశ్రమల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరిలో ఉన్న వ్యర్థ నీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటు తరించే ప్రక్రియలో ఉన్న సమస్యలను ఆర్ డబ్ల్యూఎస్ ఇంజనీర్ ద్వారా తనిఖీ చేసి వాటిని పరిష్కరించాలని తెలిపారు. యాంత్రిక అద్దకం పరిశ్రమలన్నీ సిస్టంను 4 నెలల సమయంలో ఏర్పాటు చేసుకోవలెనని తెలిపారు. దానికి సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి కాలుష్య నియంత్రణ మండలికి తెలియజేయాలని అన్నారు. నగరిలో ప్రస్తుతం నడప బడుచున్న అన్ని యూనిట్‌లకు సంబంధించిన సమగ్ర సమాచారంను సేకరించివలసినదిగా కాలుష్య నియంత్రణ మండలిని, నగరి కమిషనర్‌ను ఆదేశించారు. వ్యర్థనీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటు నిర్వహణ గురించి 15రోజుల తరువాత జరిపే సమావేశంలో నిర్ణయం తీసుకోనుబడుతుందని తెలిపారు. నగరి, చింతలపట్టేడ ప్రాంతంలో ప్రభుత్వం రూ.16కోట్లు వెచ్చించి ఒక రోజుకి 40 లక్షల లీటర్లు వ్యర్థనీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటు ఏర్పాటు చేసినప్పటికి కేవలం 1.50 లక్షల వ్యర్థ నీరు మాత్రమే శుద్ధి చేయడం జరుగుతున్నదని, ఎక్కువశాతం చేతి అద్దకం పరిశ్రమల నుండి వ్యర్థ నీటిని మున్సిపల్ మురుగునీటి కాలువలతో విడుదల చేయడం ద్వారా చుట్టూపక్కల గల చెరువులు, నదులు, భూగర్భ జలాలు నీటి కాలుష్యానికి గురి అవుతున్నాయని తెలిపారు. దీనికి తోడుగా నగరి చుట్టూ పక్కల ప్రాంతాలలో నడపబడుచున్న 16 యాంత్రిక అద్దకం పరిశ్రమలలో నిబంధనల ప్రకారం 7 మాత్రమే నడవడం జరుగుతున్నదని, మిగతా పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా నడపబడుతున్నాయని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు అశోక్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఐసి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజిఎం భార్గవి, నగరి కమిషనర్ మంజునాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శనివారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల ఇన్వెస్టిగేషన్లో ప్రోసిజర్ పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగంగా పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చెయ్యాలన్నారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి, నాటుసారా తయారీ, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలన్నారు. సెబ్‌పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన గంజాయి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అక్రమ మద్యం, ఇసుక ఇతర కేసులు, నాటుసారా నిర్మూలనకు చేపట్టిన చర్యలు, బౌండ్ ఓవర్ కేసులు నమోదు, ఇతర విషయాలపై పలు సూచనలు, సలహాలు తెలియచేశారు. సెబ్ పోలీస్‌స్టేషన్లలో పెండింగు కేసుల ఇన్వెస్టిగేషన్‌లో ప్రోసిజర్ ప్రకారం అన్ని జాగ్రత్తలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దర్యాప్తు వేగంగా పూర్తిచేసి నిందితులను అరెస్ట్ చేయాలని, కోర్టులో ఛార్జ్ షీట్లు దాఖలు చేసి ముద్దాయిలకు శిక్ష పడేలా చెయ్యాలని, డ్రగ్ పెడ్లర్స్‌కు లింకై ఉన్న నిందితులను, మాదకద్రవ్యాలని సేవించే వారిని గుర్తించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాత ముద్దాయిలను బైండోవర్ చెయ్యాలని, జిల్లాలో గంజాయి తదితర డ్రగ్స్ వంటి వ్యవస్థీకృత నేర వ్యవస్థల మూలాలను పట్టాలనీ, గంజాయి రవాణా చేసినా, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

నగర పాలక కార్మికులకు మెరుగైన వైద్యం

- విజయవంతంగా మెడికల్ క్యాంపు నిర్వహణ - 612 మందికి వైద్యపరీక్షలు

మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న నగర కమిషనర్, మేయర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం, శనివారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతంగా జరిగింది. రెండు రోజులపాటు నిర్వహించిన వైద్యశిబిరంలో నగర పాలక సంస్థలోని పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగం పరిధిలోని 612 మంది కార్మికులు వైద్య సేవలు పొందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. రెండో రోజు శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో అపోలో, ఇతర ఆస్పత్రులకు చెందిన 14 మంది వైద్యులు 10 విభాగాల్లో వైద్యసేవలు అందించారన్నారు. వైద్య శిబిరంలో భాగంగా కంటి శస్త్రచికిత్స, ఆర్థోపెడిక్ ప్రత్యేక చికిత్స కోసం ఎంపిక చేసిన కార్మికులకు తదుపరి మెరుగైన చికిత్స అందించడం కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి చర్యలు తీసుకుంటామని వివరించారు. వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవడంపై కార్మికులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ చెప్పారు. శనివారం మధ్యాహ్నం కమిషనర్, మేయర్ ఎస్.అముద, స్టాండింగ్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కె.నిర్మల, ఎస్.సుష్మ, కె.అశోకన్, ఆర్.శశికుమార్‌లు సందర్శించారు. కార్మికులకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులతో మాట్లాడారు. కమిటీ సభ్యులు రక్త, కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యశిబిరాన్ని అపోలో ముఖ్య నిర్వహణ అధికారి నరేష్ రెడ్డి పరిశీలించారు. వైద్య శిబిరంలో కార్మికులకు అందించిన వైద్య సేవలు, తదుపరి చర్యలపై కమిషనర్‌తో చర్చించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై వెంటనే స్పందించండి: డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సత్వరమే స్పందించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం డిఆర్ఓ ఛాంబర్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలను శాఖలవారీగా జిల్లా రెవెన్యూ అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారానికి ప్రతిశాఖలో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విధానపరమైన నిర్ణయాల కొరకు ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. సమావేశంలో డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, డిఆర్డిఏ, హౌసింగ్ పిడిలు తులసి, పద్మనాభం, డిఎల్‌డిఓ రవికుమార్, డీఎస్పీ శ్రావణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులు

ఉచిత బస్సు ప్రయాణంపై త్వరలో మహిళలకు శుభవార్త : మంత్రి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన నాటి నుండి రాష్ట్రంలో కోలాహల పండుగ వాతావరణం నెలకొందని రాష్ట్ర రవాణా యువజన మరియు క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిత్తూరు ఆర్‌టిసి బస్ డిపోలో 17 నూతన బస్సులను మంత్రి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్‌ఏలు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్, నగర మేయర్ అముదతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జేసి పి.శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఆర్‌టిసి ఆర్ఎం జితేంద్రనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ నిర్వీర్యమైనదని చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత సుమారు 1400 బస్సులు ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలోకి వచ్చాయని, సుమారు 400 బస్సులు రోడ్ల మీదికి వచ్చాయన్నారు. ఏ ఉద్దేశ్యంతో ఏపీఎస్ ఆర్టీసీని స్థాపించారో గత ఐదేళ్లలో నిర్వీర్యమైన సంస్థను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు చేపడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ సక్రమంగా ప్రజలకు అందేవిధంగా ముఖ్యమంత్రి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర రవాణాసంస్థ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. మన జీవనంలో ఆర్టీసీ బస్సు ఒక భాగమని, కుగ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సులు వెళ్లడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ముఖ్యంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అతి త్వరలోనే మహిళలకు ఒక శుభవార్త చెబుతామని తెలిపారు. వచ్చే ఐదు సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను తీసుకొని రావడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో దొరబాబు, సికె.బాబు, కఠారి హేమలత, ఆర్టీసీ డిఎం రూపశ్రీ, నాయకులు చల్లా బాబు,సి ఆర్ రాజన్, వసంత్ కుమార్, కాజూరు రవి, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు: కలెక్టర్

-సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో పాలఉత్పత్తి పెంపుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ జిల్లాలోని పాడిరైతులకు వివిధ డెయిరీల వారు ఇస్తున్న పాల ధర, పాల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లాలోని 21 ప్రైవేట్ డెయిరీల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు పాలకు ఒక్కో డెయిరీ వారు ఒక్కో ధరను ఇవ్వడం జరుగుతున్నదని, జిల్లాలో వ్యవసాయం తరువాత ఉద్యాన, పాడి పరిశ్రమపై ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వెన్న శాతం ఒకే విధంగా ఉన్నప్పటికీ ధర వ్యత్యాసానికి గల కారణాలపై చర్చించారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వివిధ డెయిరీలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ పాడి రైతులకు చెల్లించే పాల ధరలో వ్యత్యాసానికి గల కారణం డిమాండ్ సప్లై కారణమని, దానితో పాటు వివిధ డెయిరీల పోటీలను ఆధారం చేసుకుని ధరల మార్పు ఉంటుందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కో ఆపరేటివ్ డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు లీటర్‌కు రూ.5లను అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరుగుతున్నదని, ఈ విధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేస్తే బాగుంటుందని, దీనితో పాటు పశు భీమా పథకం ప్రస్తుతం సంవత్సరంలో 4 నెలలు మాత్రమే అమలు చేయడం జరుగుతున్నదని, అలా కాకుండా సంవత్సరం అంతా అమలు చేయడం, ప్రస్తుతం అందిస్తున్న రూ.30 వేలు భీమా మొత్తాన్ని పెంచాలని, తద్వారా పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, డెయిరీల ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు పశు గ్రాసం కొరకు జొన్న, మొక్క జొన్న విత్తనాలు సరఫరా చేయడం జరిగిందని పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో పశు సంవర్థక సహాయక డీడీలు గోవిందయ్య, ఆరిఫ్, 21 ప్రైవేట్ డెయిరీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

21వ అఖిల భారత పశుగణన-2024

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారత దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కోట్ల కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం, పోషకభద్రత రెండింటినీ అందించడంలో పశువుల పెంపకం కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో పశుసంవర్ధకశాఖకు చెందిన 21వ అఖిల భారత పశుగణన-2024 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశు సంవర్ధక రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చురుగ్గా కృషి చేస్తుందని, పశువులు, కోళ్ళ పరిశ్రమలో నాణ్యతను మెరుగుపరచడానికి, వ్యాధులను నియంత్రించడానికి తద్వారా రైతులను ప్రోత్సహించడానికి వివిధ పథకాలను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని గాంధీ సర్కిల్, మిట్టూరులోని మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కును శనివారం ఉదయం కమిషనర్ డాక్టర్ జె.అరుణ తనిఖీ చేశారు. మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కులో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను, శుభ్రతా పనులను తనిఖీ చేశారు. ఫుట్‌పాత్ నిర్మాణం, మొక్కల పెంపకం, పిల్లలు ఆడుకునే పరికరాలు, చెట్ల వద్ద చదువుకోవడానికి వీలుగా బల్లలు ఏర్పాటు చేయాలన్నారు. పార్క్ బయట అక్రమణలను తొలగించి, పార్కింగ్ కోసం సిద్ధం చేయాలని, వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ నిర్మాణంపై అధికారులతో చర్చించారు. పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. గాంధీ సర్కిల్ బస్‌స్టాప్‌లో బస్ షెల్టర్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంపై అధికారులతో కలిసి పరిశీలించారు. అపోలో సౌజన్యంతో బస్ షెల్టర్ల నిర్మాణంపై చర్చించారు. రోడ్డుపై వర్షపు నీరు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, అపోలో సీఓఓ నరేష్ రెడ్డి, డీఈ రమణ, టీపీవో శారద, ఇంచార్జ్ సెంటర్ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ రెడ్డి, టీపీబీవో మనోజ్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎంపీడిఓ కార్యాలయంలో చిత్తూరు ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయంను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ప్రారంభించారు. స్థానిక చిత్తూరు ఎంపీడిఓ కార్యాలయంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కి క్యాంపు కార్యాలయంను ప్రారంభించేందుకు విచ్చేసిన జిలా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుకి మహిళలు స్వాగతం పలికారు.

వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

విరాళాలు సేకరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- పలమనేరు

కేరళ బాధితులు ఆదుకోవాలని శనివారం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ప్రారంభించి మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికి పైగా మృత్యువాతపడ్డారని, వందలాదిమంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొంతమంది జాడ కానరావడం లేదని అన్నారు. బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని, వారిని ఆదుకోవడానికి దేశవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు విరాళాలు సేకరణ కార్యక్రమం జరుగుతున్నదని అందులో భాగంగా మొదటి రోజు పలమనేరులో చేస్తున్నామని తెలిపారు. పలమనేరు ప్రజానీకం విరిగా విరాళాలు ఇచ్చి వరద బాధితులు ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎంత సహాయ సహకారాలు అందించినప్పటికీ యావత్ భారత ప్రజానీకం అండగా నిలవాల్సిన సమయమిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని కూడా రాజకీయంగా వాడుకుంటున్నదని రాజకీయాలకతీతంగా వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, భువనేశ్వరి, ఈశ్వరయ్య, ధనలక్ష్మి లక్ష్మయ్య, సంజయ్ పాల్గొన్నారు.

రిలీఫ్ ఫండ్‌కు డబ్బు పంపేందుకు అవసరమైన బ్యాంక్‌ఖాతా నెం. 50021152209, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చిత్తూరుకి పంపాలని కోరారు.

వయనాడ్ ఘటన దురదృష్టకరం

పుంగనూరు: కేరళ రాష్ట్రం వయనాడ్ ఘటన తీవ్రదిగ్భ్రాంతిని కలిగిస్తుందని ఇది చాలా దురదృష్టకరమని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వయనాడులో జరిగిన విధ్వంసం ప్రకృతి వైపరీత్యం కొన్ని వందల మంది చనిపోవడం, కొన్ని వేలమంది నిరాశ్రయులుగా మారిపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి అభాగ్యులకు ఎక్కువ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

గంగవరం: కేరళ రాష్ట్రంలో వయనాడ్‌లో కొండ చరియలు ఘటనను జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయంలో మనీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్థ సారథి, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వయనాడ్‌లో జరిగిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం మాటలు గారడీని వదిలిపెట్టి బాధితులకు అన్ని సదుపాయాలతో శిబిరాలు ఏర్పాటు చేసి కేరళకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పింఛన్..'అధికార' టెన్షన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఒకటోతేది వచ్చిందంటే జిల్లా యంత్రాంగంలో టెన్షన్ మొదలవుతుంది. ఎక్కడెక్కడ ఎలాంటి లబ్దిదారులు ఉండారో ఎంపిక చేసుకుని, వారికి ప్రభుత్వ పరంగా అందించాల్సిన పింఛన్ కోసం కసరత్తు ప్రారంభిస్తారు. అయితే వివిధ కారణాలు చూపుతూ నెలనెలా పింఛన్ అందించే లబ్దిదారుల సంఖ్య తగ్గిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటూ కలెక్టరేట్ వద్ద క్యూ కడుతుండటం గమనార్హం. టిడిపి కూటమి అధికారం చేపట్టిన తరువాత ప్రతినెలా వెయ్యి చొప్పున ఇప్పటికి మూడువేల మంది లబ్దిదారులకు పింఛన్ వేటు పడటం గమనార్హం.

ప్రతి నెల ఒకటో తారీఖు వస్తోందంటే జిల్లా కలెక్టర్ మొదలు కింద స్థాయి యంత్రాంగం వరకు టెన్షన్ మొదలవుతోంది. అనాధలు, అభాగ్యులు, వృద్దులు, వితంతువులు, దీర్ఘకాలిక అనారోగ్య బాధితులకు ప్రభుత్వ పరంగా పింఛన్ రూపంలో తామున్నామంటూ ఆదుకునేవారు. గత ప్రభుత్వంలో వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటోతారీఖునే లబ్దిదారుల ఇంటి వద్దకే వారు నిద్రలేచే సరికి పెన్షన్ ఇంటి ముందే వేచి ఉండేది. దీంతో లబ్దిదారులు ఎలాంటి వ్యయప్రయాసలు పడాల్సిన పనిలేకుండా ఉండేది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలు ప్రారంభం కావడంతో లబ్దిదారులకు కష్టాలు తప్పలేదు. పాలకులు వారి వారి రాజకీయ ప్రయోజనాలు దృష్ట్యా లబ్దిదారులను సచివాలయాలు, బ్యాంకులు చుట్టు తిప్పారు. పైగా మూడు నెలలకు పెన్షన్ దారుల్లో కోతలకు అనధికారంగా సిద్దమయ్యారు. జిల్లా వ్యాప్తంగా మూడు నెలల కాలంలో మూడువేల మందికి కోత విధించడం గమనార్హం. మే నెలలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 70 వేల 390 మంది లబ్దిదారులకుగాను రూ.80.47 కోట్ల రూపాయలు విడుదల చేశారు. జూన్‌లోలో 2 లక్షల 69 వేల 684 మంది లబ్దిదారులకు గాను రూ.80.47 కోట్ల రూపాయలను పంపిణీ చేశారు. జూలై నెలకు గాను 2 లక్షలకు 69 వేలే 162 మంది లబ్దిదారులను ఎంపిక చేసి ఎన్నికల మూడు నెలల అదనపు బోనస్‌తో కలిపి రూ.182.30 కోట్ల రూపాయలను విడుదల చేశారు. ప్రస్తుత ఆగస్టు నెలకు గాను 2 లక్షల 67 వేల 772 మంది లబ్దిదారులను ఎంపిక చేసి రూ.113.17 కోట్ల రూపాయలను విడుదల చేశారు. సాధారణ ఎన్నికలు ప్రారంభమైన మే నెలతో పోల్చుకుంటే జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల వెయ్యిమంది చొప్పన లబ్దిదారులను తగ్గించడం గమనార్హం.

చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణంలో జాప్యం

- ఏళ్లు గడుస్తున్నా స్పందించని వైనం
- స్థలం కొరతే కారణం
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఏళ్లు గడుస్తున్నా పలు చోట్ల చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. స్థలం కొరతే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. ప్రస్తుతం వున్న చెత్త సేకరణ కేంద్రాల్లోనూ అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం వంటి సమస్యల కారణంగా నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఉన్నత లక్ష్యం నీరుగారుతోంది.

ఏళ్లు గడుస్తున్నా స్పందించని వైనం

సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా చాలాచోట్ల చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించలేదు. నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలో 25 గ్రామ పంచాయతీలలో 222 హ్యాబిటేషన్లో ఉన్నాయి. ఈ గ్రామాల్లో చెత్త సేకరించడం ద్వారా సంపద సృష్టించాలి. కానీ మండలాల్లో అలా జరగడంలేదు. ఇప్పటి వరకు

అధికారుల పర్యవేక్షణ లోపంతో నిరుపయోగంగా మారిన చెత్త సేకరణ కేంద్రం

7,500 రూపాయలు ఆదాయం మాత్రమే వచ్చినట్లు సమాచారం.

నిరుపయోగంగా సేకరణ కేంద్రాలు

మండలంలో 20 చోట్ల చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. చెత్త సేకరణ లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి. మారేపల్లి కేంద్రంలో దుస్థితి చూస్తే అక్కడ చెత్త సేకరణ లేదన్న నిజం బహిర్గతమైంది. పై స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు సరిగా ఇవ్వలేకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థలం లేక నిర్మాణాలు చేపట్టలేదు

మండలంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములు, బంజర భూములలో స్థలాలు ఆక్రమణకు గురి అవుతున్నాయి. స్థలం లేదనే చాకుతో చాలా చోట్ల చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణం చేపట్టలేదు. ఇందులో గంటా వారిపల్లి , మొండివెంగనపల్లి ,దేవర గుడిపల్లి ,ఇనాంకొత్తూరు , యనమలమంద, తదితర గ్రామాలలో స్థలం లేక నిర్మాణాలు చేపట్టలేదని స్థానికులు అంటున్నారు. రికార్డుల్లో ఉన్నాయి. గంటావారిపల్లె పంచాయతీ ఎంపీపీ బండి నాగరాణి సొంత గ్రామం కావడం గమనార్హం.

చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటాం..

మండలంలో చెత్త సేకరణ ఆగిన మాట వాస్తవమే. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి జీతాలు లేవు.. పునరుద్ధరణకు చర్యలు తీసు కుంటాం.. గంటా వారి పల్లె మొండివెంగన పల్లి, దేవర గుడిపల్లె, యనమలమంద, ఇనాం కొత్తూరు పంచాయతీల లో నిధులు, స్థలం కేటాయిస్తే చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాల పనులకు శ్రీకారం చుడతాం.

- పురుషోత్తం, ఈవోపీఆర్‌డి, వెదురుకుప్పం.

నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బీఈడీ, డీఈడీ కోర్సును పూర్తిచేసి టెట్‌లో క్వాలిఫై అయిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తిరుపతిలో ఉచిత భోజనం వసతి కల్పించి డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ కోచింగ్‌కు అర్హతలు బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన, టెట్‌లో ఉత్తీర్ణ కలిగిన ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులందరూ ఉచిత డీఎస్సీ కోచిక్‌కు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు, ఇతర అర్హతలు విద్యాశాఖ వారి నిబంధన మేరకు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు డిగ్రీ బీఈడీ, ఇంటర్ డీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణత పొందిన మార్కుల ప్రకారం తయారు చేయబడిన మెరిట్ జాబితా ఆధారంగా ఎంపిక చేయబడతారు (లేదా) ఏదైనా స్క్రీనింగ్ పరీక్ష ప్రకారం ఎంపిక చేయబడతారని తెలిపారు. మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషను కల్పించారని, అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటాతో పాటు వారి విద్యార్హత, కులధృవీకరణ పత్రం, రేషను కార్డు, ఆధారు కార్డు పాసుపోర్డు సైజు కలర్ ఫోటోతో పాటు బీఈడీ, డీఈడీ, టెట్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన ధృవీకరణ పత్రం, ఇతర సంబంధిత ధృవీకరణ పత్రం నకలులను గెజిటేట్ అధికారి వారచే ధ్రువీకరించి బయోడేటాకు జతపరచి, చిత్తూరులోని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి వారి కార్యాలయం, అంబేద్కర్ భవనం, కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ నెల 12వ తేది (సోమవారం) సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 08572- 241056ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

తాగునీటికి నాణ్యత పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగరంలో ప్రజలు తాగే నీటికి తప్పనిసరిగా నాణ్యత పరీక్షలు చేయాలని, క్రమం తప్పకుండా శాంపిల్స్ సేకరించాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో నగరపాలక సంస్థ సరఫరా చేసే నీటితో పాటు, ప్రజలు తాగే శుద్ధనీటికి నాణ్యతా పరీక్షలు చేయించాలన్నారు. ఏఈలు, అమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా రోజువారి వార్డు పరిధిలో క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను పర్యవేక్షించడం, లీకేజీలు గుర్తిస్తే సత్వరం అరికట్టాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. వందరోజుల హౌసింగ్ ప్రోగ్రాం పై కమిషనర్ సమీక్షించారు. నగర పాలక పరిధిలోని లేఔట్లలో ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్థాయిలో ఉన్న గృహాలను వంద రోజుల్లో పూర్తి చేయించాలన్నారు. అందుకోసం లబ్ధిదారులతో మాట్లాడి పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఏఈలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని సాంఘీక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోనీ బాలుర వసతి గృహంలో నాలుగవ తరగతి ఉద్యోగులతో డిడి రాజ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, విధులు, వినతులు, తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఈ విద్యాసంవత్సరంలో వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో గంగాధర నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూఓ వి.షకీల, వసతి గృహసంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లిలో 'పొలం బడి'

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని టీ.పుత్తూరు గ్రామంలో మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతుల పొలంబడి కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నాగపద్మిని మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఒక కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైన్ డెర్మ వీటితో విత్తన శుద్ధి చేసుకుంటే వేరుశనగలో వచ్చు కుళ్ళు తెగులను అరికట్టు వచ్చునని తెలియజేశారు. వేరుశెనగ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, కందులను కంచ పంటగా వేసుకుంటే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చునని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సరిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనమనపల్లిలో...

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కనమనపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు వేరుశనగలో మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు గురించి పొలంబడి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ వేరుశనగలో విత్తన శుద్ధి వేసే విధానం, ఉపయోగాలు, మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్ష ఫలితాల ఉపయోగాలు, జీవన ఎరువుల వాడకం, ఉపయోగాలను వివరించారు. అలాగే వేరుశనగలో కంచ పంటలు, అంతర పంటలు, ఎరపంటలు ప్రాముఖ్యత గురించి వివరించారు. రసాయనిక ఎరువుల అవసరం మేరకు మాత్రమే వాడాలని సేంద్రియ ఎరువులు, కషాయాలు వాడాలని తెలిపారు.

వంట సామగ్రి వితరణ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని బాలుర వసతి గృహానికి కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ వారు వంట సామాగ్రిని వితరణగా అందించారు. పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వసతి గృహానికి వంట సామగ్రిని అందించిన కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సభ్యులతో పాటు వారికి సహాయ సహకారాలు అందించిన బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ వారిని అభినందించారు. అనంతరం లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన బాలురు ఉంటున్న వసతి గృహానికి రూ.30వేలు విలువచేసే వంట సామాగ్రిని అందించడం ఆనందంగా ఉందన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్‌రాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, కార్యదర్శి సెంథిల్, డైరెక్టర్లు శివశంకర్, సుబ్రమణ్యం, సభ్యులు మణి, సుబ్రహ్మణ్యం, గిరిధర్, రాజేష్, వార్డెన్ మురళి నాయక్ పాల్గొన్నారు.

'ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రెడ్ క్రాస్ చిత్తూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య మెలుకువలు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ నేడు విద్యార్థినులు చదువుల ప్రాముఖ్యతతో తమ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, పౌష్టిక ఆహారం తీసుకోవడంలోను నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. నగరాల్లో ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడటం అనారోగ్యానికి కారణమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం ఆరోగ్యసూత్రాల మెలకువలపై డాక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యురాలు ఎంఆర్.అరుణ కుమారి, కార్యదర్శి సహదేవ నాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గోపి, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:

మండల తహశీల్దార్‌గా శనివారం అమర్నాథ్ బాధ్యతలను స్వీకరించారు. కడప జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేసిన అమర్నాథ్ సాధారణ ఎన్నికలు-2024 సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం తహశీల్దార్లను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ చిత్తూరు జిల్లాకు తిరిగి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ మేరకు ఎస్ఆర్‌పురం తహశీల్దార్‌గా అమర్నాథ్ బాధ్యతలు స్వీకరించారు.

కార్వేటినగరం తహసీల్దార్‌గా ఎం.భగవతి

కార్వేటినగరం: మండలం తహశీల్దార్‌గా ఎం.భగవతి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వైఎస్ఆర్ జిల్లా నుండి బదిలీపై కార్వేటినగరంకు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆమె తెలిపారు. మండల సర్వేయర్ సురేష్, డిటి లీలావతి, వీఆర్వోలు బాలు సింగ్, కుమార్, తేజ, సర్వేలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా బాబు రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం: మండల తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్, కార్యాలయ సిబ్బంది తహశీల్దార్‌కు స్వాగతం పలికారు.

యాదమరి తహశీల్దార్‌గా పార్థసారథి

యాదమరి తహశీల్దార్‌గా జిఆర్.పార్థసారథి శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న పార్థసారథి బదిలీపై యాదమరి తహశీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.

నాటు తుపాకీ స్వాధీనం

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: నాటు తుపాకీతో సంచారం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు కార్వేటి నగరం ఎస్ఐ ఆవుల కృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. శనివారం సీఐ సత్తిబాబు ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం, ముక్కరవారిపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద కార్డన్ సెర్చ్ నిర్వహించగా తిరుమలయ్యపల్లి ఎస్టీ కాలనీకి చెందిన జె.అర్జున్ నాటు తుపాకి కలిగి ఉండటాన్ని గుర్తించారు. అతని నుంచి తుపాకీని స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రైవేట్ బస్సు బోల్తా

పలువురికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అతివేగంగా బస్సు నడపడంతో ఓ ప్రైవేట్ బస్సు బోల్తా పడి పలువురికి గాయాలైన సంఘటన శనివారం మేకువజామున మొగలిగాట్‌లో చోటు చేసుకున్నది. సీఐ లక్ష్మయ్య తెలిపిన సమాచారం మేరకు.. బెంగుళూరు నుండి విజయవాడకు 29 మంది ప్రయాణికులతో వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మొగిలి ఘాటులో అతివేగంగా రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికుల గాయాలతో బయటపడ్డారని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని మంగళం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రయ్య, ఉపాధ్యాయులు కలిసి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో పాటు విద్యాసామగ్రి గురువారం వితరణ చేశారు. దాత మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని కోరారు. దాతలు అందించే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు పాండిరాజన్, లతా పాల్గొన్నారు.

కళాశాల సమస్యలను పరిష్కరిస్తాం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ విచ్చేసి తన చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు కళాశాల పరిధిలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ముఖ్యంగా గ్రామాల నుండి వస్తున్న విద్యార్థినిలు రాకపోకులకు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేస్తూ, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కళాశాలలోని సమస్యలన్నింటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కళాశాల ఆవరణలో సభలు సమావేశాలు నిర్వహించడానికి ఆడిటోరియం ఏర్పాటు చేస్తామని, అలాగే ఆటస్థలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ

ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పిఎస్. మునిరత్నం, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్, పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజకుమార్, నాయకులు డాక్టర్ వెంకటేష్, గోపీనాథ్, వేలు, లోకేష్, బాలాజీ, బిజెపి కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు శివశంకర్, జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి నరేష్, పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వీపింగ్ మిషన్‌కు సాధారణ నిధుల నుంచి చెల్లింపు

స్టాండింగ్ కమిటీ తీర్మానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం జరిగింది. మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష్ కుమార్ రెడ్డి, ఆర్.శశికుమార్, ఎస్.సుష్మ, కె.అశోకన్, కె.నిర్మల పాల్గొన్నారు. అజెండాలోని అంశం స్వీపింగ్ మిషన్‌కు జనవరి 2024 నుంచి జూన్ 2024 వరకు చెల్లించాల్సిన మొత్తాన్ని సాధారణ నిధుల నుండి చెల్లించుటకు ఆమోదించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవినీతి సీఐ పై చర్యలు తీసుకోవాలి

పోలీసు స్టేషన్ ఎదుట టిడిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సిఐ చంద్రశేఖర్ తీరును నిరసిస్తూ పలమనేరు నియోజకవర్గం టిడిపి నాయకులు అర్బన్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుకను తీసుకెళ్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. పలమనేరు మండలం కూర్మాయి పంచాయితీ ముడివారిపల్లికి చెందిన పెద్దబ్బ తన ఇంటి అవసరాల కోసం ఇసుక తరలిస్తుండగా సీఐ ట్రాక్టర్లను పట్టుకొని రూ.30వేల లంచం డిమాండ్ చేశారని, లంచం ఇవ్వనందుకు ట్రాక్టర్లను సీజ్‌చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమార్కులకు కొమ్ముకాసి కౌండిన్య నదిలో ఇసుక మొత్తం లూటి కావడానికి ఈ సీఐ కారణమని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నేతల పట్ల ఆయన ప్రవర్తించే తీరు చాలా దారుణమని, ప్రతి పనికి లంచం డిమాండ్ చేస్తారని ధ్వజమెత్తారు. అవినీతికి పాల్పడే ఇలాంటి అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లతో పాటు అదుపులోకి తీసుకున్న డ్రైవర్లను విడిచిపెట్టాలని కోరారు. డిఎస్‌పి వచ్చి న్యాయం చేసేంతవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో గంగవరం సిఐ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి తీసుకున్న ఇరువురిని పంపిస్తామని అయితే ట్రాక్టర్లు తహశీల్దార్‌కి అప్పగించడం జరిగిందని విచారణ అనంతరం వాహనాలను అప్పగిస్తామన్నారు. దీనిపై ఆగ్రహించిన ఆందోళనకారులు జాతీయ రహదారిపై చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. సిఐపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం జరగనిదే వెళ్ళేది లేదంటూ ఆందోళనను కొనసాగించారు. ఎట్టకేలకు పోలీసులు సర్దిచెప్పి డ్రైవర్లను అప్పగించి వాహనాలను కూడా పంపడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళనను విరమించారు. టిడిపి నాయకులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడు, నాగరాజు రెడ్డి, గ్యాస్ నాగరాజు, ఖాజా, బాలాజీ నాయుడు, జగదీష్ నాయుడు, సెల్వరాజ్, రాంచంద్ర నాయుడు, వెంకటమునిరెడ్డి పాల్గొన్నారు.

ఏ కోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత వినతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఏకోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత కోరుతూ శనివారం మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పనిచేయుచున్న ఏకోపాధ్యాయులు అత్యవసర సమయంలో తమ సెలవులను వినియోగించుటకు కుడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చాలా ఒత్తిడికి గురి అవుతున్నారని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. మండల యూటీఎఫ్ అధ్యక్షులు మొగులయ్య, కార్యదర్శి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సురక్షిత నీటి కోసం క్లోరినేషన్ పైపులైన్

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీలో మొదటిసారిగా క్లోరినేషన్ పైపులైను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలంటే తరచూ

మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం జరిగేది. అయితే అక్కడక్కడా ఎత్తైన మంచినీటి ట్యాంకులను ఎక్కడానికి ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో సులభతరంగా మంచినీటి ట్యాంకుల నుండి గ్రామానికి నీరు సరఫరా అయ్యే పైపులైను వద్ద క్లోరినేషన్ చేయడానికి వీలుగా పైపులైను అమర్చే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యంలో పలమనేరు ఆర్డబ్ల్యూఎస్ డీఈ రవికిరణ్, ఏఈఈ హేమలత ఆదేశాల మేరకు పెద్దపంజాణి మండలంలో మొదటిగా కోగిలేరు గ్రామపంచాయతీలోని కోగిలేరు, బసవరాజుకండ్రిగ, పొట్టగానిపల్లి, చీకలదిన్నేపల్లిలో శనివారం సర్పంచ్ రమేష్ బాబు క్లోరినేషన్ పైపులైన్లను ఏర్పాటు చేయించారు. ఇలా ఏర్పాటుచేసిన పైప్లైన్లలో ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేసిన క్లోరినేషన్ మాత్రలను వేసి తద్వారా గ్రామాలకు మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ క్లోరినేషన్ పైపులైన్ల ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ పరిశీలించారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకే విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నట్టు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శనివారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అందించే అచ్చు పుస్తకాలు నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాటి ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఎదుగుదల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అందులో ఉచిత పాఠ్యపుస్తకాలు నోటి పుస్తకాలు అమ్మకు వందనం పథకాలు ఉన్నాయన్నారు. ప్రతి పేదవాడు విద్యావంతుడుగా తయారు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని దీనికోసం ప్రభుత్వం ఎంత అయినా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సర్పంచ్ ఉమాదేవి, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇన్చార్జి ధరణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

'తల్లిపాలే పిల్లలకు రక్షణ'

ప్రజాశక్తి- విజయపురం: మండలంలో జగన్నాథపురంలో సీడీపీవో కె.కృష్ణవేణి ఆదేశాల మేరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్ లక్ష్మి సందర్శించి చిన్నారులతో ముచ్చటించిన తరువాత గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పోష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ తల్లిపాలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడి టీచర్, గర్భవతులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వినతశ్రీ చిత్తూరు అపోలో ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాంబాబు ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై శనివారం గ్రామ వీధుల్లో పలువురు అంగన్వాడీలతో కలిసి ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. సూపర్వైజర్లు అనురాధ, బిందుమాలతి, నాగరత్నమ్మ, సంగీత అపోలో ఆసుపత్రి అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు బిడ్డకు తల్లిపాల అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పుష్పలత, జోత్స్న, లీలావతి మంజుల పాల్గొన్నారు. మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా డాక్టర్లు అరుణకుమార్, పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. కాంతమ్మ, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

'అపోలో' మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కొట్రకోణం గ్రామపంచాయతీలో శనివారం అపోలో మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల్లో కంటి సమస్యలు, మోకాళ్ళ సమస్యలు, అలసట, షుగర్ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. క్యాంపులో పాల్గొన్న మెడికల్ కాలేజీ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వైద్యశిబిరానికి మంచి స్పందన లభించిందని సుమారుగా 256 మంది పరీక్ష చేయించుకున్నారని కమ్యూనిటీ మెడిసిన్ అపోలో మెడికల్ కాలేజ్ హెచ్‌ఓడి డాక్టర్ అశోక్ తెలిపారు. డాక్టర్ దీప్తి, డాక్టర్ భారతి వైద్యబృందం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుమతిపై హర్షం

ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలోని ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుమతి ఇవ్వడంపై మందకృష్ణ మాదిగ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం విజయపురం మండలం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యధాల సూర్య, నియోజకవర్గ ఇన్చార్జ్ వావిలా శివయ్య, మండల ఇంచార్జ్ మునివరాలు, జిల్లా కార్యదర్శి మునివేల్, నగరి సీనియర్ నాయకుడు శివప్రసాద్, అయ్యప్ప, సూర్య, పురుషోత్తం పాల్గొన్నారు.

డీఈవో అనుచిత వైఖరి మానుకోవాలి: ఎస్‌టియు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: టీచర్లు, సంఘ ప్రతినిధులు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చినప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరించే అనుచిత వైఖరి మారాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) చిత్తూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ఎస్టియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, బి.మోహన్ యాదవ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం డీఈఓ కార్యాలయానికి వచ్చే టీచర్లు, సంఘ ప్రతినిధుల పట్ల డీఈవో అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల పర్యటనల్లో పాఠశాలల సమస్యలను ప్రస్తావించడాన్ని కూడా తీవ్రంగా తప్పుపడుతూ, పరోక్షంగా ప్రజాప్రతి నిధులను అవమానిస్తున్నారని పేర్కొన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాలు, కుటుంబ సమస్యల కారణంగా తమ పదోన్నతి రద్దుచేసి కింది కేడర్లో పోస్టింగ్ ఇవ్వాలని ఏడాదిన్నరగా పదిమంది టీచర్లు తిరుగుతున్నప్పటికీ, ఉద్దేశపూర్వక జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సమస్యకు సంబంధించి కొద్ది మందికి అనుకూలంగా, కొద్ది మందికి ప్రతికూలంగా

వ్యవహరించడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. చిన్నచిన్న తప్పిదాలను కూడా భూతద్దంలో చూసే అధికారులు... పాతిక సంవత్సరాలుగా టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాలు ఎందుకు సక్రమంగా విడుదల చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. బదిలీలు, పదోన్నతుల సందర్భాల్లో అవకతవకలు జరగడానికి కారణం రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలు బహిర్గతం చేయకపోవడమేనని స్పష్టం చేశారు. డీఈఓ కార్యాలయంలో ఫైళ్ల క్లియరెన్స్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. అధికారుల తీరు మారకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.